క్లుప్తంగా

5న కల్యాణోత్సవం

కడప కల్చరల్: కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మీ సత్యనారాయణస్వామి ఆలయంలో జూన్ 5న స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు కేహెచ్ విజయ్‌కుమార్‌భట్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 6.30 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో శ్రీ లక్ష్మీ నారాయణ, సుదర్శన హోమాలు, 9.00 గంటలకు మహా పూర్ణాహుతి ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు కల్యాణోత్సవం, మధ్యాహ్నం 12.30 గంటలకు నక్షత్ర కుంభ హారతి, 1.00 గంటకు అన్న ప్రసాద వితరణ ఉంటాయన్నారు. ఇందులో వైదిక కార్యక్రమాలు, తిరుమల–తిరుపతి వేదిక్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వరదరాజన్ రాజేష్‌భట్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని వివరించారు.

వాహనాల తనిఖీ



ఐటీఐ సర్కిల్ వద్ద వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న ట్రాఫిక్, తాలూకా పోలీసులు

కడప అర్బన్: కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ సమీపంలో ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డితో పాటు, తాలూకా ఎస్ఐలు తాయార్‌హుసేన్, రామకృష్ణ తమ సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీలను విస్తృతంగా నిర్వహించారు. ఆటో డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను పోలీసులు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ ఇతర రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు.

రీజినల్ డైరెక్టర్‌కు అభినందన

కడప కార్పొరేషన్: వైద్య, ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ అనిల్ కుమార్‌ను పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జంబారపు అహరోను తదితరులు అభినందించారు. మంగళవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ నాయకులు ఏ. ఓబులేసు, పి. రాజశేఖరాచారి, మరియ కుమారి, సత్యవతి, ప్రేమలత పాల్గొన్నారు.

25న హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

కడప కల్చరల్ : పవిత్ర హజ్ యాత్రికులకు ఈనెల 25న ఉచితంగా వ్యాక్సినేషన్ చేయనున్నట్లు ది ముస్లిం అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎం.ఫైజ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మద్రాసురోడ్డులోగల ముస్లిం ఆర్ఫనైజ్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జిల్లా హజ్ సొసైటీ, ముస్లిం అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హజ్‌కమిటీ ద్వారా హజ్–2023కు వెళ్లనున్న యాత్రికులకు ఈ ఉచిత వ్యాక్సినేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు యాత్రికులకు వ్యాక్సినేషన్ చేయించుకోవచ్చని, వారికి నిర్వాహకులు హెల్త్‌కార్డులు అందజేస్తారన్నారు. యాత్రకు అవసరమయ్యే ఎహరామ్ దుస్తులతోపాటు ఇతర సామాగ్రి తక్కువ ధరకు అందించే ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు. పూర్తి వివరాలకు 95094 47737 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

వైవీయూ అధ్యాపకుడికి సీఎస్ఆర్ నిధులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ పి.వసుగోవర్దన్ రెడ్డికి కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ కింద రూ. 2 లక్షల నిధులను హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మాసూటికల్ కంపెనీ 'డెనిస్కో కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్' మంజూరు చేసింది. ఆ సంస్థ సీఈఓ కమలాకర్ నుంచి వచ్చిన లేఖను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ చేతుల మీదుగా డా. వసుగోవర్ధన్‌రెడ్డి అందుకున్నారు. ఈ నిధులను పరిశోధనకు వినియోగించుకోవచ్చని సదరు సంస్థ సూచించింది. కాగా డా. వసుగోవర్ధన్‌రెడ్డి ఇదివరకే జర్మనీ దేశం నుంచి అలెగ్జాండర్ వాన్‌హంబోల్ట్ అవార్డు, యూజీసీ రామన్ ఫెలోషిప్, డీఎస్టీ యంగ్‌సైంటిస్ట్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను వీసీతో సహా పలువురు అధ్యాపకులు అభినందించారు.

అంతర్జాతీయ సదస్సులో ప్రసంగం

కడప ఎడ్యుకేషన్: నాన్ యాంగ్ టెక్నో విశ్వవిద్యాలయంలో సింగపూర్ వాట్ క్రియేటివ్ కన్సల్టింగ్ ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ గ్లోబర్ సింపోజియంలో లోతైన అంతర్జాతీయ సహకారాలు అనే అంశంపై కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ సహచార్యులుగా పనిచేస్తున్న రాజేంద్రకుమార్ ప్రసంగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి తెలిపారు. ఉత్తమ ప్రసంగం చేసిన రాజేంద్రకుమార్‌ను కళాశాల ఎండీ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి అమర్‌నాథరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ తదితరులు అభినందించారు.

బుడ్డాయపల్లె చెరువు ప్రాంతంలో పార్కు



అంబేడ్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్ రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: బుడ్డాయపల్లె చెరువు ప్రాంతంలో పార్కు ఏర్పాటు చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన పుట్లంపల్లె, బహుజన నగర్, సాగర్ కాలనీ, సరోజినీ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఆర్టీసీ బస్టాండు నుంచి వై జంక్షన్ వరకూ ఉన్న గార్బేజ్ పాయింట్లు తొలగించాలని సూచించారు. సంజన్న సర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకూ ఉన్న డివైడర్ల మధ్య మొక్కలు బాగా పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బహుజన్ నగర్, సాగర్ కాలనీల్లో రోడ్లు నిర్మించాలని ఆదేశించారు. ఆర్టీసీ కాలనీ, సాగర్ కాలనీల్లో యూజీడీ బ్లాక్స్‌ను వెంటనే క్లియర్ చేయించి మురుగునీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్ వరకూ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సంజీవ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ రాజారెడ్డి సేవలు మరువలేనివి



వైఎస్ రాజారెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ తదితరులు

కడప కార్పొరేషన్: పులివెందుల పెద్దాయన వైఎస్ రాజారెడ్డి అందించిన సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, జెడ్పీ వైస్ చైర్మెన్ పిట్టు బాలయ్య అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్ రాజారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ రాజారెడ్డి పెద్దాయనగా జిల్లా ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, క్రిష్ణయ్య, మహిళా నేతలు టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, క్రిష్ణవేణి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ రాక

కమలాపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ శేషా చలపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే క్రాస్ రోడ్డు వద్ద సమగ్ర తాగునీరు సరఫరా పథకం కార్యక్రమానికి భూమిపూజ చేసేందుకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మధ్యాహ్నం కమలాపురం 1వ వార్డు సచివాలయం పరిధిలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంకు ఎమ్మెల్యే హాజరు అవుతారని ఆయన తెలిపారు. అన్ని శాఖల మున్సిపల్ అధికారులు హాజరై ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జాగ్రత్తలతో వడదెబ్బను నివారించాలి

కమలాపురం : ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయని, వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువగా ఉటుందని, చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బను నివారించవచ్చని స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పి.ప్రదీప్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వడదెబ్బ నివారణపై ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి రైల్వే గేటు వరకు ర్యాలీ జరిగింది. ప్రజలకు వడదెబ్బ నివారణపై ఆయన అవగాహన కల్పించారు. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బను నివారించవచ్చన్నారు. అత్యవసరమైతే తప్పా బయటకు రాకూడదన్నారు. ఉదయం 10 గంటలలోపే పనులు ముగించుకుని ఇంటికి చేరాలన్నారు. తలకు టోపీ లేదా రుమాలు ధరించాలన్నారు. మంచినీరు, గ్లూకోజ్, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీరు ఎక్కువగా తీసుకోవడం వలన వడదెబ్బను నివారించవచ్చన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

నీతిని గ్రహించాలి

కమలాపురం : ప్రతి విద్యార్థి నీతి కథలు చదవాలని, అలాగే అందులో దాగి ఉన్న నీతిని గ్రహించాలని ఇరిగేషన్ శాఖ టెక్నికల్ ఆఫీసర్ కె.సుధాకర్ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన సదస్సులో భాగంగా మంగళవారం విద్యార్థులకు ఆయన నీతి కథలు చదివించారు. అలాగే పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజు పుస్తక పఠనం చేయాలన్నారు. అలాగే ఖాళీగా ఉన్న సయయంలో వివిధ దిన పత్రికలు, నవలలు, నీతి కథలు చదువడం అలవాటు చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి నాగాంజలి పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు భూమిపూజ

కమలాపురం : మండలంలోని చిన్నచెప్పలి గ్రామానికి తాగునీరు అందించడానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరిచి రూ.22లక్షల డీఎంఎఫ్ నిధులు విడుదల చేయించారు. ఈ పైప్‌లైన్ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి ఇతర నాయకులు, అధికారులతో కలసి మంగళవారం భూమి పూజ చేశారు. ఇటీవల చిన్నచెప్పలి గ్రామానికి తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో చర్చించి రూ.22లక్షల నిధులు మంజూరు చేయించారు. తక్షణం పనులు ప్రారంభించి పూర్తి చేసి ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో లేటపల్లె నుంచి చిన్నచెప్పలి వరకు పైప్‌లైన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు నీటి సరఫరా చేస్తామని ఏఈ తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ బుజ్జన్న, స్థానిక నాయకులు పుల్లారెడ్డి, ఎంపీటీసీ జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, సురేష్ యాదవ్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం



గ్యాస్ లీకై చెలరేగిన మంటలు

కడప అర్బన్: కడప నగరంలోని కాగితాలపెంట సచివాలయం సమీపంలో నివాసం ఉంటున్న సయ్యద్ షేక్‌షా వలీ నివాసగృహం మొదటి అంతస్తులో గ్యాస్ లీకై మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే కడప అగ్నిమాపక కేంద్రం అధికారి, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిప్రమాదాన్ని నివారించి తగిన సూచనలు, జాగ్రత్తలు తెలియజేశారు. ప్రమాదంలో ఇంటి సామాను కొంతమేర కాలి నష్టం వాటిల్లింది.

ఈ కథ 'విషాదాంతం'



ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం సిబ్బంది

కడప కల్చరల్: విధి ఎంత విచిత్రమైనది అంటూ పలు సందర్భాల్లో మనం నిట్టూరుస్తూ ఉంటాం. సరిగ్గా ఈ సంఘటన కూడా అలాంటిదే. ప్రముఖ కథా రచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి తన సతీమణికి నలతగా ఉండడంతో కడప నుంచి కుమార్తె ఉంటున్న ఒంగోలుకు వెళ్లారు. అక్కడ ఆమెకు చికిత్స చేయిస్తున్నారు. ఆ మరునాడు ఉదయం 5.30 గంటల సమయంలో ఆయనకు ఇంట్లోనే గుండెపోటు రావడంతో ఆస్పత్రిలో చేర్చారు. కానీ ఫలితం లేకపోయింది. చికిత్స తీసుకుంటున్న ఆయన సతీమణికి భర్త చనిపోయారన్న విషయం తెలపలేదు. కాగా మంగళవారం ఉదయం ఆయన భౌతికకాయాన్ని కడపకు తీసుకొచ్చారు. ఓ గంట తర్వాత సమీప బంధువులు ఆయన సతీమణిని 'కడపకు వెళదాం' రమ్మన్నారు. పెద్దాయనను ముందే కడపకు తీసుకు వెళ్లారంటూ.. ఆయన మరణించిన విషయాన్ని ఆమెకు తెలిపారు. ఆ నిజాన్ని భరించలేక ఆమె తీవ్ర స్థాయిలో విలపించారు. బంధుమిత్రులు ఆమెకు సేదతీర్చి ప్రత్యేక వాహనంలో కడపకు తీసుకు వచ్చారు. కడపలోని స్వగృహానికి వచ్చిన ఆమె భర్త భౌతికకాయాన్ని దర్శించుకుని 'నన్ను విడిచి ముందే వెళ్లావా' అంటూ కన్నీటిపర్యంతమయ్యారు.

వైవీయూ : ప్రముఖ కథారచయిత, అకడమీషియన్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రం సలహామండలి సభ్యుడు కేతు విశ్వనాథరెడ్డి మరణం విశ్వవిద్యాలయానికి, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి తీరనిలోటని వైవీయూ వీసీ సుధాకర్, రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం అభివృద్ధికి తన సలహాల ద్వారా ఎంతో కృషిచేశారని పేర్కొన్నారు. గజ్జల మల్లారెడ్డి ట్రస్టు సభ్యుడుగా ఉంటూ పాత్రికేయులను అవార్డుల ఎంపికలో కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన మరణం ఆవేదనకు గురిచేసిందని పేర్కొన్నారు.

పలువురి నివాళి

కడప కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కథా రచయిత, సాహితీవేత్త కేతు విశ్వనాథరెడ్డి మరణం బాధాకరమని వైవీయూ ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

- సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఎల్ఐసీ యూనియన్ నాయకులు రఘునాథరెడ్డి, సభ్యులు, ప్రొద్దుటూరుకు చెందిన రచయితలు దాదా హయాత్, పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, సహాయ పరిశోధకులు గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ శివారెడ్డి, ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ చిన్నపరెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, చిత్రకారులు గజ్జెల విజయభాస్కర్, సాహితీవేత్తలు జీవీ సాయిప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, సాక్షాత్కారం రమణారెడ్డి, జిల్లా టూరిజం అభివృద్ధి సంస్థ సలహా మండలి సభ్యులువెంకటేశ్వరాచారి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

నేడు సీపీఐ జాతీయ కార్యదర్శి రాక

కడప వైఎస్సార్ సర్కిల్: కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత, కథా రచయిత కేతు విశ్వనాథరెడ్డికి నివాళులర్పించేందుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ బుధవారం కడపకు రానున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.

ఎగ్జిబిషన్ సేల్



ఎగ్జిబిషన్‌లో మహిళల కొనుగోళ్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఈనెల 22 నుంచి 25వ తేది వరకు ఏర్పాటు చేసిన డిజైనర్స్ ఎగ్జిబిషన్ సేల్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ నేటి ఆధునిక కాలానికి అనుగుణంగా ఆధునిక డిజైన్లతోకూడిన డిజైనర్ శారీస్, ఫ్యాన్సీ, హ్యాండ్‌వర్క్ శారీస్, కోల్‌కతా, బెనారస్, ఆర్గంజీ, టసార్, జార్జి కాటన్, కంచిపట్టు కోటా శారీస్, డ్రస్ మెటీరియల్స్, బెడ్‌షీట్స్, దివాన్ సెట్లు, 92.5 సిల్వర్, గోల్డ్ కవరింగ్ జ్యువెలరీ అందుబాటులో ఉంచామన్నారు. మహిళలు, యువతులు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్‌ను సందర్శించి తమకు నచ్చిన వాటిని ఎంపిక చేసుకోవాలని సూచించారు.

'భూ సమస్యను పరిష్కరించండి సారూ'

కమలాపురం : మండలంలోని మొలకవారిపల్లెకు చెందిన చింతా నాగసుబ్బమ్మ అనే మహిళా రైతు తన భూ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటోంది. మంగళవారం ఆమె కమలాపురంలో విలేకరుల ఎదుట తన గోడును వెళ్లబోసుకుంది. సంబటూరు పొలాల్లో సర్వే నెంబర్ 334/3లో తనకు 1.86 ఎకరాల పొలం ఉందని, అయితే ఇందులో 6 సెంట్ల స్థలాన్ని 2006లో మైలవరం దక్షిణ కాలువ నిర్మాణానికి ప్రభుత్వం తీసుకుందన్నారు. నష్టపరిహారం కూడా ప్రభుత్వం తనకు ఇచ్చిందన్నారు. అయితే అధికారులు చేసిన తప్పిదం వలన నా భూమి పూర్తిగా కాలువ కిందనే ఆన్‌లైన్‌లో చూపిస్తోందని, దీని వలన తాను మార్టిగేజ్ చేసుకోలేక పోతున్నానని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. తన పొలంలో 6 సెంట్లు కాలువ నిర్మాణానికి పోను మిగిలిన 1.80 ఎకరాల స్థలం తనదేనని రెవెన్యూ రికార్డుల్లో చూపించాలని ఆమె కోరారు. అధికారుల దృష్టికి పలుమార్లు ఈ సమస్య తీసుకెళ్లినా స్పందించడం లేదని, కనీసం ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తన భూ సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు. ఈ సమస్య కారణంగా తాను రుణం పొందలేక పోతున్నానని ఆమె తెలిపారు.

బాలకృష్ణయాదవ్‌కు సన్మానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : బీజేపీ కడపజిల్లా పార్లమెంటు కన్వీనర్‌గా నియమితులైన బాలకృష్ణయాదవ్‌ను అఖిల భారత యాదవ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. యాదవ సమాజానికి చెందిన బాలకృష్ణ యాదవ్ రాజకీయ జీవితంలో అంచెలంచెలుగా ఎదిగి నేడు బీజేపీ కడప పార్లమెంటు కన్వీనర్‌గా నియమితులు కావడం సంతోషదాయకమన్నారు. బి.లక్ష్మయ్యయాదవ్, గంగాదేవి యాదవ్, కావేటి ప్రతాప్ యాదవ్, సంజీవరాయుడు యాదవ్, పంగా సుబ్బరాయుడుయాదవ్, తిరుమల యాదవ్, ఆర్కేనగర్ శ్రీనుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాపాడు తల్లీ...విజయదుర్గమ్మ!



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ప్రతి మంగళవారంలాగానే ఈసారి కూడా రాహుకాల పూజలు నిర్వహించారు. భక్తుల సంఖ్య ఊహించని విధంగా పెరగడంతో ఆ ప్రాంగణంలో చోటు చాలలేదు. రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పందిరి బండి.. అదిరిందండి!



కడప రూరల్: మండే ఎండలు మనుషుల్నే కాదు మూగజీవాలనూ 'ఉక్క'రిబిక్కిరి చేస్తున్నాయి. ఈ క్రమంలో ఓ ఒంటెద్దు బండి యజమాని ఇదిగో ఇలా బండికి పందిరి కట్టి తనతో పాటూ కోడెద్దునూ ఎండ సెగల నుంచి కాపాడుకుంటున్నాడు. ఎండ తగలకుండా పాత సంచి, వస్త్రాలతో పందిరిలా ఏర్పాటు చేసుకోవడం పలువురిని ఆకర్షించింది. కడప నగరం కోటిరెడ్డి సర్కిల్‌లో కనిపించిన చిత్రమిది. మూగ జీవం పట్ల ప్రేమను చూపడంతో జంతు ప్రేమికులూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పడిపోయిన బోర్డు



కడప కార్పొరేషన్: కడప నగరంలో ఇటీవల వీచిన గాలులకు నగర శివార్లలో ఏర్పాటు చేసిన స్వాగతం బోర్డు విరిగిపోయింది. కడప నగరం నలువైపులా స్వాగత బోర్డులను ఏర్పాటు చేసేందుకు నగర పాలక సంస్థ ఒక్కో బోర్డుపై సుమారు రూ.20వేలు ఖర్చు చేసి ఏర్పాటు చేసింది. వీటిని నాటి కొద్ది రోజులు కూడా కాకముందే చిన్నమాచుపల్లె వద్ద ఏర్పాటు చేసిన ఈ స్వాగతం బోర్డు ఇలా నేలపై ఒరిగిపోయింది.

ప్రమాదకరంగా హోర్డింగ్



కడప కార్పొరేషన్: కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ప్రగతి ఆర్థోపెడిక్ జనరల్ హాస్పిటల్ బిల్డింగ్ పైన ఉన్న హోర్డింగ్ ఇటీవల వీచిన పెనుగాలులకు పడిపోయింది. పిల్లర్స్‌తో సహా ఊడిపోయి గాల్లో తేలుతూ కరెంటు తీగలు, స్తంభాలపై ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈ వీధి రద్దీగా ఉంటుంది. ప్రమాదం జరగకముందే దాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టీచర్ల బదిలీల్లో ఖాళీలన్నింటిని చూపించాలి

– ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్యాం సుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం త్వరలో నిర్వహించబోయే టీచర్ల బదిలీలలో ఖాళీలను బ్లాక్ చేయకుండా అన్నింటిని చూపించాలని ఆ మేరకు బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాం సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంతాలకు సమీపంలోని ఖాళీలను బ్లాక్ చేయడం వల్ల సుదీర్ఘంగా దూర ప్రాంతాల్లో పనిచేసిన సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పదోన్నతులకు మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్‌ను నిర్వహించాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాషా, శ్రీనివాసులరెడ్డి, గురవయ్య, జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు ప్రసాద్, శివానందం, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములను కేటాయించాలి

కడప రూరల్: పేదలకు భూములు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని చర్చా వేదికలో వివిధ పంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన చర్చావేదికలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బందెల ఓబయ్య, కానగల మునెయ్య, ఎస్సీ ఎస్టీ రాయలసీమ నాయకులు జేవీ రమణ మాట్లాడుతూ అధికారులు పేదలకు భూములు దక్కేలా చర్యలు చేపట్టాలన్నారు. అసైన్ కమిటీకి సంబంధం లేకుండా ఆన్‌లైన్‌లో ఎక్కించిన భూములపై విచారణ చేపట్టాలన్నారు. ఆమూరి బాలదాసు, కైపు రామాజంనేయులు, వెంకటన్న, సీఆర్‌వీ ప్రసాద్, శ్రీకృష్ణ, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

తైవాన్ విశ్వవిద్యాలయంతో వైవీయూ ఎంఓయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రిజిస్ట్రార్, తైవాన్ యూనివర్సిటీ ప్రతినిధి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం తైవాన్ దేశానికి చెందిన నేషనల్ ఫార్మోసా యూనివర్సిటీతో మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంఓయూ) కుదుర్చుకుంది. మంగళవారం వైవీయూలో వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, తైవాన్ విశ్వవిద్యాలయం ప్రతినిధి నవీన్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఎంఓయూ మార్చుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ వైవీయూ విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధన, సమకాలీన అంశాలు, ఫ్యాకల్టీ నైపుణ్యాభివృద్ధి, విద్యార్థులకు ఉపాధికి అవసరమయ్యే నైపుణ్యాలు అందించేందుకు తైవాన్ విశ్వవిద్యాలయంతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు, ఆర్ అండ్ డీ డైరెక్టర్ ఆచార్య పి. చంద్ర ఓబులరెడ్డి, రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఏజీ దాము, ఆచార్య ఎన్.సి. గంగిరెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ డా. ఎల్. సుబ్రమణ్యంశర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: నగర శివార్లలోని హెలెన్ కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెలెన్ కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ దౌలత్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. బాచిలర్ ఆఫ్ డిగ్రీ లేక మాస్టర్ ఆఫ్ డిగ్రీలో సైన్సు, సోషల్ స్టడీస్, హ్యూమనటీస్‌లో ఓసీలు 50 శాతం మార్కులు, బీసీ, ఎస్టీ, ఎస్సీ, పీహెచ్‌లకు 45 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. వివరాలకు 9966006758 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వల్లి ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపీ, ల్యాబ్, మందులను, రికార్డులను పరిశీలించారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు. మందుల కొరత ఏమైనా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే పెసవాండ్లపల్లె గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు.వైద్యాధికారులు వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌లు పాల్గొన్నారు.